❖•❖•❖ 12 ❖•❖•❖

# ప్రధాన యాజకుడైన అన్న యెదుట యేసు

*“అంతట సైనికులును సహస్రాధిపతియు, యూదుల బంట్రౌతులును, యేసును పట్టుకొని ఆయనను బంధించి, మొదట అన్న యొద్దకు ఆయనను తీసికొనిపోయిరి; అతడు ఆ సంవత్సరము ప్రధానయాజకుడైన కయపకు మామ” (యోహాను 18:12, 13).*

యేసు తీర్పులలోని ప్రతి దశ ఒక ప్రత్యేక తీర్పుగా ఎంచబడుచు, అవి సామాన్యముగా ఆరు దశలుగా విభజింపబడును. వాటి లక్షణములను బట్టి మొదటి మూడు యూదీయమైనవి (లేక మతపరమైనవి), చివరి మూడు రోమీయ (పౌర సంబంధమైన) తీర్పులు. మొదటి మూడు – అన్న, కయప, మరియు యూదుల మహా సభ (సన్హెడ్రిన్ సభ) యెదుట – తీర్పులు చరిత్ర యందలి తీర్పులన్నిటిలోను అత్యంత కలవరపాటు కలిగించునవై యున్నవి. పాశవికమైన నేరములు తరుచుగా మతము పేరిట చేయబడునను గంభీరమైన సత్యమును అవి మనకు గుర్తు చేయును. యేసు పేరు ప్రఖ్యాతులు గాంచిన మొదటి శతాబ్దములోని మత నాయకుల ప్రభావముచేత ఖండింపబడి సిలువవేయబడ్డాడు. యోహాను చెప్పుచున్నట్లుగా, “ఆయన తన స్వకీయులయొద్దకు వచ్చెను; ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు” (యోహాను 1:11). ఆయనను గౌరవించుటలోను ఆయనే మెస్సీయా యనియు ప్రభువనియు చాటించుటలోను మొదటివారై యుండవలసినవారే, ఆయనను తృణీకరించుటలో మొదటివారయ్యారు! యథార్థమైన మతము దేవుడు మానవునికి ఎప్పుడైనా అనుగ్రహించిన ఆశీర్వాదములలో అతి గొప్ప ఆశీర్వాదమై యున్నది, కానీ మానవ జాతిని అత్యంత ఘోరమైన భ్రష్టాచారులనుగా చేసినది అసత్య మతమే.

యేసు అన్న యెదుటికి తీసికొనిపోబడినాడని చెప్పుచున్న సువార్త యోహాను వ్రాసిన సువార్త మాత్రమే. క్రీస్తు సిలువ శ్రమానుభవములలో గమనించవలసిన ఒక వాస్తవమును యోహాను చేర్చాడు: యేసును పరీక్షించుటలోను సిలువవేయుటలోను అన్న, ప్రధాన యూదామత నాయకుడు, వహించిన పాత్ర.

యేసు పట్టబడినప్పుడు అన్న తాత్కలికముగా పనిచేయుచుండిన ప్రధాన యాజకుడైయుండలేదు, కానీ అసలైన ప్రధాన యాజకుడు, కయపకు వెనుకనుండి ప్రోత్సాహము నిచ్చుచుండిన శక్తియై యుండెనని స్పష్టమగుచున్నది, ఇరువది సంవత్సరములకు మునుపు, క్రీ.శ. 7–14, అన్న అధికారములో నుండిన ప్రధాన యాజకుడై యుండెను, కానీ వారిరువురి మధ్య తలెత్తిన భేదాభిప్రాయములను బట్టి గ్రేటస్ అతనికి స్థానచలనం కలిగించాడు. పాత నిబంధన ప్రకారము, ప్రధాన యాజకుడు మరణపర్యంతము అధికారములో ఉండవలెను. ఏదిఏమైనా, రోమా పట్టణము, “మీరు మీ మహా సభ (సన్హెడ్రిన్) ద్వారా మీ స్వంత ప్రజలకు తీర్పు తీర్చవచ్చును, కానీ మీకు ప్రధాన యాజకులుగా ఎవరు ఉంటారను విషయమును మేము నిర్ణయిస్తాము” అని ఉత్తరువులు జారీ చేసినది. అన్న రోమా ప్రభుత్వము చేత తన అధికారములోనుండి తొలగింపబడినప్పటికిని, యూదులు అతనిని ప్రధాన యాజకునిగానే పరిగణించి యుందురు (లూకా 3:2). తన కుమారుడైన ఎలియాజరు, అతని తరువాత

ప్రధాన యాజకుడుగా నియామకము చేయబడునట్లు అన్ని ఏర్పాట్లు చేశాడు అన్న; ఎలియాజరు తరువాత, అదే స్థానములో అతని అల్లుడైన కయప ప్రధానయాజకుడుగా అధికారములో ఉండునట్లు చూచుకొన్నాడు. సరికదా తరువాతి రోజుల్లో కయప తరువాత తన నలుగురు కుమారులు వరసగా ప్రధాన యాజకులుగా అధికారములో ఉండునట్లు కూడ ఏర్పాట్లు చేస్తాడు. అన్న చెలాయించిన విధముగా యెరూషలేములో యూదీయ అధికార సోపాన క్రమమును యింకెవరును చెలాయించలేకపోయారని ఈ వాస్తవములు బలముగా తెలియజెప్పుచున్నవి. ఈ కాలములో అన్న యెరూషలేములోని అత్యంత శక్తివంతమైన అధికారులలో ఒకడై యుండవచ్చును.

దీనంతటికి తోడుగా, యేసు సిలువవేయబడవలెనని ప్రోద్బలమునిచ్చినవాడు ఈయనే అనునది దాదాపుగా నిశ్చయము. ఆయనతో కూడా, యూదా ముప్పది వెండి నాణెములకు యేసును అప్పగించుటకు తన ఒప్పందమును కుదుర్చుకొనియుండును. అధికారము, డబ్బు, మరియు నియంత్రణ అన్నీ అన్న అదువులో ఉండెను. ప్రధాన యాజకుడుగా ఉండిన నేపథ్యం, సిరిసంపదలు, మరియు పదవీ కాలమునుబట్టి, యూదా మత నాయకత్వములోని అత్యధిత శక్తివంతమైన అధికార యంత్రాంగ ఆసనమును సులభముగా ఆక్రమించుకొన్నాడు. ఈ పరిస్థితిని యింకెవరును తలక్రిందులు చేయనట్లయితే అతడును అతని కుటుంబికులును యూదా దేశ ప్రజలపై యింకా అనేక సంవత్సరములు వారి అధికారము చెలాయించుదురు. మెస్సీయాయైన యేసు రాకడ అతని భాగ్యభోగ్యాలను మరియు ప్రజలపై ఉండిన అతని పట్టును నేలమట్టం చేయునేమోయను భయాందోళనను సృష్టించినది. అతడు చూడగోరిన మెస్సీయా యేసు వంటివాడు కాదు. అతడు తన అధికారము, పరువు, దేవాలయము ద్వారా వచ్చుచుండిన ఆదాయము, మరియు యూదులపై గల పెత్తనమును పట్టుకొని వేలాడుచుండును; తన పదవి మరియు అభ్యుదయేచ్ఛలో జోక్యము కలుగజేసుకొనగలుగుటకు నజరేయుడైన యేసును అన్న అనుమతించడు.

యేసు పట్టబడుటకు ప్రధాన *సూత్రధారి* అన్న గనుక, ఆయన పట్టబడిన తరువాత యేసు ఏమి చేయవలెనో యని నిర్ణయించుటలో కూడా ఆయనదే పైచేయి అయియుండును. యేసుకు వ్యతిరేకముగా ఉద్యమమును ప్రోత్సాహించిన అన్న, ఇప్పుడు త్వరత్వరగా అతని శాయశక్తులా దానిని తీవ్రతరము చేయుచు, దానిని పూర్తిచేయుటకు నిశ్చయించుకొని యుండెను. అందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేశాడు, జారీ చేయవలసిన ఉత్తరువులన్నిటినీ జారీ చేశాడు, మరియు కుట్రను కూడా రూపొందించుకొన్నాడు. కాబట్టి పట్టబడిన తరువాత, యేసు అన్న యెదుటికి తీసుకొనిపోబడెను.

యేసు ఎలాగైనా వినాశం చేయబడవలసినదే యని నిర్ణయించుకొన్నాడు గనుక, యేసును ఖండించుటకు ఏ హేతువునైనను కుయుక్తితో రూపొందించుకొనగలుగునట్లు అన్న యేసును చూడగోరెను. యేసు అతని యెదుట నిలువబడియున్నప్పుడు, అతడు "ఆయన శిష్యులను గూర్చియు ఆయన బోధను గూర్చియు" యేసును ప్రశ్నించాడు (యోహాను 18:19). అన్న యేసుతో వ్యవహరించుచుండిన విధానములో పాత నిబంధనలో గలవియు రోమా ప్రభుత్వము చేసినవియునైన శాసనములు ఉల్లంఘించబడినవి. యేసుకు విరోధముగా ఎటువంటి వాస్తవ నేరారోపణ స్థాపింపకయే ఆయనకు తీర్పు తీర్చబడవలెనని అన్న యెదుటికి తీసుకొని వచ్చిన తరువాత, యేసు నేరస్తుడని రుజువు చేయుటకు ఏదో ఒక నేరమును కనుగొనవలెను

ప్రయత్నముతో అన్న యేసును ప్రశ్నించుటకు ప్రారంభించాడు.

మహిమగల రాజు అన్న యెదుట భయము చేత ఒదగిపోలేదు లేక తన కుటిల పన్నాగములు పన్నుటకు ప్రయత్నించలేదు. ఆయన, "నేను బాహాటముగా లోకము ఎదుట మాటలాడితిని; యూదులందరు కూడివచ్చు సమాజమందిరములలోను దేవాలయములలోను ఎల్లప్పుడును బోధించితిని; రహస్యముగా నేనేమియు మాటలాడలేదు. నీవు నన్ను అడుగనేల? నేను వారికేమి బోధించినది విన్నవారిని అడుగుము; ఇదిగో నేను చెప్పినది వీరెరుగుదురు" అని ప్రశాంతంగా ప్రత్యుత్తరమిచ్చాడు (యోహాను 18:20, 21). యేసు ఇచ్చిన జవాబు అన్న ఏమి చేయుచుండెనో బయలుపర్చినది. ఈ నిర్బంధము విషయములో అన్న తన హోదాకు దగ్గట్టుగా గౌరవముతోను న్యాయసమ్మతముగాను వ్యవహరించలేదను భావమును యేసు కనుపర్చాడు. యేసు ఏమేమి బోధించాడో ఏమేమి చేశాడో అధికారియై యుండిన అన్న అతి సులభముగా విచారించి తెలిసికొనగలిగి యుండెను. యేసును, ఏ విధమైన న్యాయసమ్మతమైన హేతువు లేకుండానే పట్టబడినవానిని, ఆయన ఈ విధమైన ప్రశ్నలు అడుగుట క్షమింపకూడని విషయము.

వివరణలోని ఈ సందర్భములో, ఈ సన్నివేశము ప్రశ్నోత్తర సమయమందు యేసు ప్రక్కలో నిలువబడి యుండిన ఒక అధికారివైపునకు మళ్లుచున్నది. ఈయన, అన్నకు కొంచెము గౌరవమును ఆపాదించవలెనను ఆతురతగల ఉద్దేశముతో, యేసు యొక్క చెంప మీద కొట్టుచు, "ప్రధానయాజకునికి ఈలాగు ఉత్తరమిచ్చుచున్నావా?" అని అన్నాడు (యోహాను 18:22). ఈసారి కూడా యేసు పలికిన మాటలు మరొకసారి పరిస్థితిని ప్రశాంతముగా చిత్రీకరించుచున్నవి. ఆయన, "నేను కాని మాట ఆడిన యెడల, ఆ కాని మాట ఏదో చెప్పుము; మంచి మాట ఆడిన యెడల నన్నేల కొట్టుచున్నావు?" అని అన్నాడు (యోహాను 18:23). తద్వారా యేసు విచారణాధికారులు నిందితుని స్థానములో నిలబడునట్లు చేశాడు. ఈ స్వల్పకాల ప్రశ్నోత్తర సమయములో, అతని అధికార గదిలో ఉండిన అన్న, యేసు నోట నుండి వచ్చిన కేవలము అరడజను వాక్యములతోనే చిత్తైపోయాడు.

ఏదిఏమైనా, అన్న, ఎటువంటి భయముచేతనైనను నివారింపబడుటకు చోటివ్వలేదు. "అంతట అన్న, యేసును బంధింపబడియున్నట్టుగానే ప్రధానయాజకుడైన కయప యొద్దకు పంపెను" అని వాక్యభాగములో వ్రాయబడి యున్నది (యోహాను 18:24). కల్పిత నేరారోపణలతోను హానికరమైన పన్నుగడలతోను, ప్రధానయాజకుడు సహితము యేసుకు విరోధముగా ఏదైన నేరము కల్పించవలెనని పట్టుబట్టి అన్న యేసును కయప యొద్దకు పంపించాడు. ఈ విధముగా అన్న దేవుని కుమారుడు, యేసు సిలువవేయబడవలెనను మంటను రగిలించిన కాగడాగా చరిత్ర పుటల్లోనికెక్కాడు.

మన ప్రభువు ఎదుర్కొనుచుండిన తీర్పులలోని ఈ దశ ఘోరమైన పరిస్థితులతోను పన్నుగడలతోను వ్యవహరించుట గూర్చి మనకు ఏమి నేర్పించుచున్నది? *మొదటిదిగా, మానవుల జీవితములోని పాపము ఈ లోకములో అన్నిటిని మించిన పెద్ద సమస్యయై యున్నదను భావము ఈ దశ ద్వారా అర్థమగుచున్నది.* పాపము పెత్తనం చెలాయించుచున్న ఒకడు పాపము పెత్తనం చెలాయించుచున్న సహచరులకు నాయకుడై యున్నందువలన యేసు సిలువవేయబడ్డాడు. అనుమతించాలే గాని, అత్యధికముగా ప్రభావితము చేయగల నిష్పాపరుడైన నాయకున్ని సహితము, విషపూరితమైన వానిగాను, చెడ్డవారితో రహస్యంగా

సమ్మతించువానిగాను, స్వార్థపరునిగాను, మరియు నిజాయితీలేనివానిగాను పాపము మార్చివేయగలదు. డంబాచారుడైన ఒక దైవ సేవకుడు దేవుని యథార్థమైన సేవకున్ని హత్యచేయునట్లు అది వానిని ఒప్పించినది.

*ఇంతేగాక, నీకు చేయబడగల ఘోర హాని చేసినవానిని ఎదుర్కొనునప్పుడు కూడా, దెబ్బకు దెబ్బ తీయుట ఖచ్చికము కాదని ఈ దృశ్య వివరణ ఉదాహరణముగా వివరించుచున్నది.* "రెండవ చెంప కూడా త్రిప్పుము" అను మాటలలో గల అసలు అర్థమును యేసు మనకు బోధించాడు. అన్న యెడల యేసు ప్రతీకార మనస్సుతో కాదు, కృపాసహితముగా ప్రతిస్పందించాడు. ఆయన "పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు. ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు; ఆయన శ్రమపెట్టబడియు బెదిరింపక, న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్నుతాను అప్పగించుకొనెను" (1 పేతురు 2:22, 23). యేసు ప్రశాంతముగాను మర్యాదపూర్వకముగాను సత్యమును తెలియజెప్పుటద్వారా ఆయన అన్నకు ప్రత్యుత్తరమిచ్చాడు.

అత్యంత ఆశ్చర్యకరమైన స్థాయిలో, యేసే సమస్త మానవుల రక్షకుడై యున్నాడని ఈ సన్నివేశము కనబరుచుచున్నది. మన రక్షణార్థమై ఆయన తన ప్రాణమును అర్పించుటకు తీర్మానించుకొన్నాడు, అట్టి తీర్మానము నుండి వెనుకకు తగ్గేది లేదు. యేసు ఒక్క మాటతో తీర్పు అంతటిని ముగించగలవాడై యుండెను. తన సమ్మతిని తెలియజేస్తూ ఒక్క సారి తలను ఆడించుట ద్వారా, ఆయనకు విరోధముగా చెయ్యెత్తిన లేదా, ఆయన పట్ల ఒక చెడు మాట పలికిన ప్రతి దుష్ట మానవుని ఆయన తక్షణమే నరకమునకు పంపగలిగియుండెను. ఏదిఏమైనా, లోక పాపము కొరకు తనను తాను అప్పగించుకొని పరిహారార్థ బలిగా అర్పించుకొనుటకు నిర్ణయించుకొని, ఆయన సంకుచిత మనస్సు గలవాని యెదుట శాంతముగా నిలువబడి యుండెను.

❖◆❖◆❖

*వాస్తవములన్నీ మనకు తెలిసినట్లయితే, చరిత్ర అంతటిలోను ఒక అతి దుర్మార్గుడైనవాడని – అమాయకుల రక్తము వీధుల గుండా ప్రవహించునట్లు చేసిన, మనష్షే కంటె; క్రైస్తవులను హింసించిన, డొమీషియన్ కంటె; వేలాది మంది యూదులను విష వాయువుగల గదులలోనికి పంపిన, హిట్లర్ కంటె; మరియు, తన స్వంత జనమునే ఆకలితో ఉంచిన స్టాలిన్ కంటె, అన్యాయముగా దూషించి యేసును హింసించుట తక్కువేమి కాదు. కాని వాటినన్నింటిని తెరవెనుకనుండి నడిపెను. ఇటువంటి మనిషిని ఏమి చేయవలెను క్రీస్తు ఏమి చేసెనో నిర్లక్ష్యము చేయ తగదు. అతడు వాని కోసం ప్రాణము విడిచెను.*